చెత్త.. నిర్వహణ

- నాలుగురోజులకొకసారి కనిపిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది
- పెడన డంపింగ్‌యార్డ్‌లో పేరుకున్న నిల్వలు
- పని చేయని సీసీ కెమెరాలు


పెడనలో ప్రధాన రహదారి పక్కన మెయిన్ డంపింగ్ యార్డులో చెత్త నిల్వలు

పెడన: మునిసిపాలిటీలో 'చెత్త' నిర్వహణ సరిగా లేక పోవడంతో ఎక్కడికక్కడ నిల్వలు పేరుకుపో తున్నాయి. నాలుగురోజులకొకసారి వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బంది కనిపిస్తున్నారు. పెడన పురపాలక సంఘ పరిధిలోని 23 వార్డుల్లో 31వేలకు పైగా జనాభా ఉన్నారు. వార్డుల్లో చెత్తను సేకరిస్తే రోజుకు 16 నుంచి 20 మెట్రిక్ టన్నులు వరకు వస్తోంది. గత పదేళ్లుగా రికార్డుల్లో 16 మెట్రిక్ టన్నుల చెత్తను చూపుతూ వస్తున్నారు. జనాభాతోపాటు చెత్త అధికమవుతోంది. చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది అర కొరగా ఉన్నారు. చెత్త సేకరణకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తీసుకున్నా వారు వివిధ విభాగాల్లో పని చేస్తుండటంతో మరింత ఇబ్బందికరంగా మారింది.

51 మందే పని చేస్తున్నారు

ఇక్కడ జనాభాకు తగ్గట్టు 70 నుంచి 75 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సి ఉంది. కానీ 51 మందే పని చేస్తున్నారు. వీరిలోనే వాహనాల డ్రైవర్లు, మేస్త్రీలు ఉన్నారు. వీరిలో ఎవరు సెలవు పెట్టినా.. వీఐపీలు వచ్చే ప్రాంతాలకు విధులు కేటాయించినా వార్డుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తూనే ఉంటున్నాయి. వార్డుల్లో నాలుగు రోజులకొకసారి పారిశుద్ధ్య కార్మికులు కనిపిస్తున్నారని, ఇంటింటి చెత్త సేకరణ అసలు జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీసీ కెమెరాలు పనిచేయని పరిస్థితి

చెత్త సేకరణలో మెరుగైన ఫలితాలు సాధించడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

తడి పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువుగా మార్చే చోట ఒక కెమెరా, తామర చెరువు వద్ద ఏర్పాటు చేసిన కెమెరా, ఎంఆర్ఎఫ్(మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) సెంటర్‌గా డంపింగ్ యార్డులో ఒక కెమెరా ఏర్పాటు చేసి దానిని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సెల్ ఫోన్‌కే కాకుండా ఇతర ఉన్నతాధికారుల ఫోన్లకు లింకు చేసి పర్యవేక్షం చేవారు. అవి ఇప్పుడు పని చేయని దుస్థితి. దీంతో పర్యవేక్షణ కొరవడింది.

కొరవడిన పర్యవేక్షణ

గతంలో శానిటరీ మేస్త్రీలుండే వారు. గత ప్రభుత్వం వారి స్థానంలో సచివాలయాలకు చెందిన శానిటరీ కార్యదర్శులను నియమించింది. ప్రస్తుతం వీరు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.
ప్రస్తుత పాలకవర్గం శానిటరీ మేస్త్రీలను కేటాయించడంతో వారికి.. ఈ ఐదుగురు కూడా తోడయ్యారు. వీరితో పారిశుద్ధ్య సిబ్బంది పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదనే వాదనలు న్నాయి. మేస్త్రీలు ఒక పనిచెబితే..కార్యదర్శులు మరొక పని చెబుతున్నారంటూ పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. దీంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

మినీ డంపింగ్ యార్డులు...

పట్టణంలోని పలుచోట్ల మిని డంపింగ్‌యార్డులు తయారయ్యాయి. దీనిపై ప్రశ్నిస్తుంటే రికవరీ పాయింట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. 2వ వార్డులో శివాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి పక్కన, మెట్ల పూర్ణచంద్రరావు కాలనీకి వెళ్లే మార్గంలో, వైఎస్సార్ కాలనీ, తూర్పు తెలుగుపాలెం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇలా మినీ డంపింగ్ యార్డులు దర్శనమిస్తున్నాయి. వాస్తవంగా వార్డుల్లో వచ్చే చెత్త నేరుగా వాహనాల్లోకి ఎత్తి తీసుకెళ్లే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు ముందుకు పడటం లేదు.


కంపోస్టు ఎరువుగా మార్చే సెంటరు వద్ద పని చేయని సీసీ కెమెరా


డంపింగ్ యార్డు పక్కన ఎంఆర్ఎఫ్ సెంటరు వద్ద పని చేయని సీసీ కెమెరా

పరిస్థితిని చక్కదిద్దడానికి చర్యలు



పారిశుద్ధ్య పనులను చక్కదిద్దడానికి సరైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, నిపుణుల సలహాలు బాగుంటే వాటిని కూడా అమలుచేస్తాం. రికవరీ పాయింట్లపై ఆలోచన చేస్తున్నాం. ఇక్కడ చెత్త లేకుండా నేరుగా డంపింగ్ యార్డుకు తరలించడానికి చర్యలు తీసుకుంటాం. సిబ్బంది, వాహనాల కొరత ఉంది. సీసీ కెమెరాలను త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చూస్తాం.

–ఎం.గోపాలరావు, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

చల్లపల్లిలో ఆర్డీవో తనిఖీలు



చల్లపల్లి: మచిలీపట్నం ఆర్డీవో స్వాతి చల్లపల్లిలోని పెట్రోల్ బంకు, థియేటర్‌ను గురువారం తనిఖీ చేశారు. విజయవాడ రోడ్డులోని పెట్రోల్ బంక్‌కు వెళ్లి రికార్డులు పరిశీలించారు. పక్కనే ఉన్న కోమల థియేటర్‌ను, 5వ నంబర్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట పీడీఎస్ డీటీ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నెలాఖరులోపు వ్యాపార లైసెన్స్ ఫీజులు చెల్లించండి

బందరు కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు రకాల వ్యాపార సంస్థలను నిర్వహించే వ్యాపారులు ఫిబ్రవరి 28వ తేదీలోపు వ్యాపార లైసెన్స్ ఫీజులను(డీ అండ్ ట్రేడ్ లైసెన్స్) చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. మార్చి 1వ తేదీ నుంచి ఫీజులు చెల్లించే వ్యాపారులకు 50 శాతం అపరాధ రుసుంతో లైసెన్స్‌లు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఫిబ్రవరి 28వ తేదీలోపు ఉదాహరణకు రూ. వెయ్యి చెల్లించాల్సి ఉంటే మార్చి 1నుంచి రూ. 500 అపరాధ రుసుంతో లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉంటుందని ఇది గమనించి వ్యాపారులు త్వరితగతిన ఫీజులు చెల్లించాలని ఆయన కోరారు. కార్యాలయ పని వేళల్లో నగరపాలక సంస్థ కార్యాలయంలోని హెల్త్ విభాగంలో ఎఫ్–2 గుమాస్తాకు చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

క్లుప్తంగా

కోళ్ల దిగుమతిలో అప్రమత్తంగా ఉండండి



పెడన: బర్డ్ ఫ్లూ పక్క జిల్లాల్లో విజృంభిస్తున్న నేపథ్యంలో కోళ్లను దిగుమతి చేసుకునే వారు అప్రమత్తంగా ఉండాలని పెడన మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. ఆయన మున్సిపల్ కార్యాలయంలో గురువారం పట్టణంలోని మాంసం దుకాణాదారులు, కోళ్ల విక్రయించే వారితో పాటు శానిటరీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా సరిహద్దుల్లో ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు చేపట్టారని, పోలీస్ వారితో పాటు పశుసంవర్ధక శాఖల అధికారులు చెక్ పోస్టులు పెట్టారని తెలిపారు. చికెన్ మాంసం వ్యాపారులు సహాయ సహకారాలను అందించాలని చెప్పారు. కోళ్లకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా తక్షణం సమాచారాన్ని శానిటేషన్ కార్యదర్శులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.
ఘంటసాల: ఉభయ గోదావరి, ఇతర జిల్లాల నుంచి కోళ్లు కానీ, కోడిగుడ్లు కానీ దిగుమతి చేసుకోవద్దని ఎంపీడీవో డి.సుబ్బారావు వ్యాపారులు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చికెన్ షాపులు, పౌల్ట్రీ ఫారాలు, కోడిగుడ్ల వ్యాపారులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, పశువైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సలార్‌దాదా హౌస్ అరెస్టు



మచిలీపట్నంటౌన్: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్ దాదాను గురువారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయన్ను ఇంటిలోంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. నగరంలోని ఇనుగుదురుపేటలోని సలాదాదా ఇంటికి తెల్లవారు జామునే చేరుకున్న పోలీసులు ఆయనకు నోటీసులు అందజేసి హౌస్ అరెస్టు చేశారు.

సెంట్రల్‌జోన్ పోటీల్లో రాళ్లరేవు విద్యార్థుల ప్రతిభ



కృత్తివెన్ను: బాలికల సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో మండలంలోని రాళ్లరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు గురువారం హెచ్‌ఎం చంద్రమోహన్ తెలిపారు. అవనిగడ్డలో జరిగిన పోటీల్లో టెన్నికాయిట్‌లో ప్రథమస్థానం, సాఫ్ట్‌బాల్‌లో ద్వితీయస్థానం సాధించినట్లు వివరించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

ఆలయానికి ఊయల బహూకరణ



కృత్తివెన్ను: గాంధీ నగరం గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయానికి గ్రామస్తుడు పిన్నెంటి పాండురంగారావు గురువారం ఊయల బహూకరించారు. ఆయన తన కుమారుడు సూర్యరామాంజనేయులు దంపతులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారి మనవడిని తులాభారం వేసి కమిటీ సభ్యులకు ఊయలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి జ్యోతిర్మహోత్సవాలు



పెడన: పట్టణంలోని బ్రహ్మపురంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి భజన గుడి వద్ద నిర్వహిస్తున్న జ్యోతిర్మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి రక్తతర్పణానికి వినియోగించిన కత్తుల ఊరేగింపు పూర్తయిన తర్వాత గురువారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, రాత్రి అమ్మవారి నగరోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. నగరోత్సవంలో జై శాంభవి...జై..జై..శాంభవి అంటూ భక్తులు ముందుకు సాగారు. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు ఊటుకూరి ఏకనాథ్ సుధీర్‌కుమార్, హేమ కనక దుర్గ నాగరాణి దంపతులు తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరోత్సవానికి బయల్దేరిన అమ్మవారిని పురవీధుల్లో రోడ్డుకు ఇరువైపుల భక్తులు నిలబడి దర్శించుకుని తరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హోటల్ యజమానిపై కలెక్టర్ ఆగ్రహం


బందరులో హోటల్ యజమానిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని మూడు స్తంభాల సెంటర్ వద్ద రాజస్తాన్‌కు చెందిన ఓ హోటల్ నిర్వాహకుడిపై కలెక్టర్ డీకే బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిలో గురువారం ఉదయం అటువైపుగా కలెక్టర్ వెళ్తున్నారు. హోటల్ ముందున్న రహదారి సర్వీస్ రోడ్డులో తాగి కుప్పలుగా పడేసిన పేపర్ ప్లేట్‌లు, టీ గ్లాసులు దర్శనమిచ్చాయి. వీటిని చూసిన కలెక్టర్ కారును ఆపి ఆ హోటల్ వద్దకు వచ్చి రోడ్డుపై ప్లేట్‌లు, గ్లాసులు వేయడంపై యజమానిని ప్రశ్నించారు. సరైన సమాధానం రాకపోవడంతో అతనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి పక్కనే శుభ్రత లేకుండా ఇలా ప్లేట్‌లు, టీ తాగిన గ్లాసులను విచ్చలవిడిగా వేయటమేంటని ప్రశ్నించారు. నగరంలోని హోటల్స్, రెస్టారెంట్లు, టీ స్టాల్ నిర్వాహకులు చెత్తను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. పారిశుద్ధ్యం విషయంలో ఉపేక్షించేది లేదని, అలసత్వం వహిస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
'చెత్త' సంపద కేంద్రాలను నిర్వహించకపోతే ఎలా
చినకళ్లేపల్లి(ఘంటసాల): చిన్న గ్రామాల్లో కూడా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించకపోతే ఎలా అంటూ కలెక్టర్ డీకే బాలాజీ పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘంటసాల మండలం వేములపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా జరుగుతున్న భూముల రీసర్వే తీరును పరిశీలించడానికి కలెక్టర్ బాలాజీ గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా వేములపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వే పై సర్వేయర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించి ఫీల్డ్ గ్రౌండ్ ట్రూతింగ్ (భూమిపై కచ్చితత్వం) పనులు ఏమేరకు జరిగాయో తనిఖీ చేశారు. చినకళ్లేపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై ఈవో నయూమ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్వే అధికారి ఎం.జోషిలా, డీఐఓఎస్ ఎస్.విజయవర్మ, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.
చల్లపల్లి: మండల పరిధిలోని వక్కలగడ్డ సచివాలయాన్నికలెక్టర్ డి.కె.బాలాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన కలెక్టర్ రీసర్వే రికార్డులను పరిశీలించి సర్వే పనులు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు.

ముగిసిన 'గ్రిగ్' బాలికల క్రీడా పోటీలు


అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్ విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 84వ గ్రిగ్ మెమోరియల్ బాలికల సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, షటిల్, బాల్ బాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో రెండు రోజుల పాటు జరిగినపోటీల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పలు జట్లు పోటీ పడ్డాయి.

విజేతల వివరాలు

అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో ఈడుపుగల్లు విద్యార్థిని కె.దేవీశ్రీ సాయిదీప్తి ప్రథమ, తాడంకి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి.వెంకట లక్ష్మి ద్వితీయ, స్వతంత్రపురం విద్యార్థిని పీవీ నందిని తృతీయ స్థానం సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో లింగారెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి దివ్య ప్రథమ స్థానం సాధించగా, గొడవర్రు హైస్కూల్ విద్యార్థిని పి.మేరీ జ్యోత్స్న ద్వితీయ, స్వతంత్ర పురం హైస్కూల్ విద్యార్థిని తృతీయ స్థానం సాధించారు. 1500 మీటర్ల విభాగంలో లింగారెడ్డిపాలెం విద్యార్థిని బి. దివ్య ప్రథమ, గొడవర్రు విద్యార్థినులు పి.మేరీ జ్యోత్స్న ద్వితీయ, పి.దీపిక తృతీయ స్థానం సాధించారు. లాంగ్‌జంప్‌లో లింగారెడ్డిపాలెం విద్యార్థిని పి.మధుప్రియ ప్రథమ స్థానం, అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రణవి ద్వితీయ, ఈడుపుగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వి.దీప్తి మాధురి తృతీయ స్థానం సాధించారు. షాట్‌పుట్‌లో మంగళాపురం హైస్కూల్ విద్యార్థిని కె.వాసవి ప్రథమ, లింగారెడ్డిపాలెం విద్యార్థిని పి.మధుప్రియ ద్వితీయ, గొడవర్రు విద్యార్థిని డి.శ్రీజ తృతీయ స్థానం సాధించారు. హైజంప్‌లో లింగారెడ్డిపాలెం విద్యార్థిని ఎస్‌కే సిద్ధిక ప్రతిమ, మచిలీపట్నం సీపీఎస్ విద్యార్థిని ఎం.జయజ్యోతిక ద్వితీయ, పామర్రు అసిస్సి స్కూల్ విద్యార్థిని కె. ఆయుష్క తృతీయ స్థానం సాధించారు. హేమర్‌త్రోలో మంగళాపురం విద్యార్థినిలు కె. వాసవి ప్రథమ, ఎస్.శ్రీలక్ష్మి ద్వితీయ, మాజేరు హైస్కూల్ విద్యార్థిని వై.రేవతి తృతీయ స్థానం సాధించారు.
ట్రిపుల్ జంప్ విభాగంలో లింగారెడ్డిపాలెం విద్యార్థిని మధుప్రియ ప్రథమ, ఈడుపుగల్లు విద్యార్థిని దీప్తి మాధురి ద్వితీయ, లింగారెడ్డిపాలెం విద్యార్థిని లావణ్య తృతీయ స్థానం సాధించారు. 3కె వాక్ విభాగంలో గన్నవరం శ్రీసాయి శ్రీనివాస్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.దీపిక ప్రథమ, ఈడుపుగల్లు విద్యార్థిని ఆర్ లక్ష్మీ భారతి ద్వితీయ, మొవ్వ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని యామిని తృతీయ స్థానం సాధించారు.

వైభవంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలుడు

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. గురువారం ఉదయం కల్యాణమూర్తులకు వసంతోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆలయ సమీపంలోని చెరువులో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో స్వామివార్లను ఊరేగించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ జరిగింది. యాగశాలలో పూర్ణాహుతిని చేశారు. రాత్రికి కల్యాణమూర్తులకు పుష్పాభిషేకం చేశారు. పవళింపుసేవతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అనంతవరానికి చెందిన కుప్పా రామగోపాల సోమయాజి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. శృంగేరీ పీఠం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించగా, రాష్ట్రం నలుమూల నుంచి భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకొని మూలమూర్తికి వెండి కవచాలను అలంకరించారు. ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉన్నాం

వీసీలో కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధిపై అప్రమత్తంగా ఉన్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం సాయంత్రం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదని అప్రమత్తంగా ఉన్నామన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బందితో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని పౌల్ట్రీ ఫాంలలో తనిఖీలు నిర్వహించి యజమానులకు బయో సెక్యూరిటీ మెజర్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పశుసంవర్ధక, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పారా మెడికల్ సిబ్బందితో 18 బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలపై నివేదికను సమాచారాన్ని తీసుకుంటున్నట్లు కలెక్టర్ బాలాజీ సీఎస్ కు వివరించారు. వీసీలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్ శర్మిష్ట, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి చిన నరసింహులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలో శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు డ్రైవర్స్ కాలనీ, పాత హౌసింగ్ బోర్డ్, కొత్త హౌసింగ్ బోర్డ్, సోమశేఖ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గూడూరు: మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారిపై తరకటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మచిలీపట్నం నుంచి విజయవాడకు ద్విచక్రవాహనంపై యువకుడు వెళ్తుండగా పర్ణశాల సమీపంలో వ్యక్తి రోడ్డుదాటుతూ అడ్డుగా వచ్చాడు. బండి వేగాన్ని అదుపుచేయలేక బైక్‌పై వెళ్తున్న వ్యక్తి వృద్ధుడిని ఢీకొని డివైడర్‌పై పడిపోయాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలవ్వగా 108లో బందరు ఆస్పత్రికి తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు, పశువుల చావిడి దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న ఈశ్వరమ్మ గృహం

కోడూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు, పశువుల చావిడి దగ్ధమైన ఘటన కోడూరు మండలంలో చోటు చేసుకుంది. విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన తోట ఈశ్వరమ్మ బుధవారం రాత్రి నిద్ర పోయింది. అర్ధరాత్రి 12గంటల సమయంలో విద్యుత్ మీటర్‌లో నుంచి మంటలు రావడంతో బయటకు పరుగులు తీసింది. ఈశ్వరమ్మ చూస్తుండగానే మంటలు ఇల్లాంతా వ్యాపించాయి. నిప్పురవ్వలు పక్కనే ఉన్న తోట నాగేశ్వరరావు పశువుల చావిడిపై పడటంతో అక్కడ కూడా మంటలు రేగాయి. ప్రమాదంలో పూరిల్లు, చావిడి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఈశ్వరమ్మ ఇంటి పక్కన ఉన్న నాగేశ్వరమ్మ ఇంటికి కూడా వ్యాపించగా, స్థానికులు వాటిని అదుపు చేశారు. దీంతో నాగేశ్వరమ్మ ఇంటికి ప్రమాదం తప్పింది. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో రూ.5లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈశ్వరమ్మకు చెందిన గృహోపకరణాలు, నగదు, బంగారంతో పాటు విలువైన డాక్యుమెంట్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలింది.
–బాధితురాలు ఈశ్వరమ్మకు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చేయూతనిచ్చారు. సొసైటీ మండలాధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు సహకారంతో బాధితురాలికి 25 కేజీల బియ్యం, కూరగాయలతో పాటు గృహోపకరణాలను అందించారు. శాఖ వైస్‌చైర్మన్ తోట శ్రీనివాసరావు, సభ్యులు రవిశంకర్, వేణు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణంలో విద్యాబుద్ధులు


చల్లపల్లి జెడ్పీ పాఠశాలలో జరిగిన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చల్లపల్లి: ప్రేమ, స్నేహపూర్వక వాతావరణంలో పిల్లల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కొనసాగాలని మండల విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు సూచించారు. 'పోషణ్ భీ-పడాయి భీ'లో భాగంగా మొవ్వ ఐసీడీఎస్ పరిధిలోని చల్లపల్లి మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు మొదలయ్యాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సీహెచ్ ఆదిలక్ష్మి, జె.విశ్రాంతమ్మ పాల్గొన్నారు.
ఘంటసాల: చిన్న వయసులోనే పిల్లలకు ప్రేమ, స్నేహ పూర్వక వాతావరణంలో పూర్తి సామర్థ్యాలను అందించాలని ఘంటసాల మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్లు టి.రమా నాగమణి, డి.మేరీ అన్నారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
మోపిదేవి: బిడ్డ పుట్టకముందు నుంచే నవచేతన, ఆదర్శ శాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి తెలిపారు. మోపిదేవి జెడ్పీ ఆవరణలో అంగన్‌వాడీ టీచర్స్‌కు పోషణ్ భీ.. పడాయి భీపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీవో శేషుకుమారి, సూపర్‌వైజర్లు రత్నమాల, నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఐసీడీఎస్ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.

అమలులో సెక్షన్ 30

- ర్యాలీలు, ధర్నాలు నిషేధం
- డీఎస్పీ విద్యశ్రీ

అవనిగడ్డ: ఎస్పీ గంగాధర్ ఆదేశాల మేరకు అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉండటంతో ధర్నాలు, ర్యాలీలు చేయడం నిషేధమని డీఎస్పీ టి.విద్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ఆందోళనలు, ర్యాలీలు, ధర్నాలు, సభలు నిర్వహించడం, రాజకీయ నాయకులు సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు వివాదాస్పద పోస్టులు పెట్టడం నిషేధమన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో వ్యాయామోపాధ్యాయుల సత్తా



గూడూరు: కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గూడూరు మండల వ్యాయామోపాధ్యాయులు సత్తాచాటారు. ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన ఏపీ పీఈటీ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సెమినార్, గేమ్స్, స్పోర్ట్ మీట్‌లో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కప్పలదొడ్డి పీడీ మురళీకృష్ణ, మల్లవోలు పీడీ రవీంద్రబాబు విజేతలుగా నిలిచారు. క్రికెట్ టోర్నీలో గూడూరు పీడీ రన్నర్స్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. అనంతపురంలో జరిగిన అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్ విభాగంలో గూడూరు పీడీ మత్తి అరుణ బంగారు పతకాలు సాధించగా, ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

క్రీడా పరికరాలు అందజేత



అవనిగడ్డ: అవనిగడ్డ సబ్ డివిజన్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు గురువారం క్రీడా పరికరాలను ఏఎస్‌డబ్ల్యూవో బి.మోహనరావు అందించారు. మొత్తం 10 బాల, బాలికల వసతి గృహాలకు పది రకాల క్రీడా పరికరాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు అవసరమని, వీటితో మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం, ఒత్తిడిని తట్టుకునే శక్తి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు వార్డెన్లు పాల్గొన్నారు.